
ఈ వారం తెలుగు పుస్తకం

# 'ఇది కల్పవృక్షం'-కల్పవృక్ష కావ్యానుశీలనము

-ముదిగొండ వీరభద్రయ్య



**Title:** Idi Kalpavriksham

**Subject:** CLASSICS RAMAYANAM

**Author:** Vadali Mandeswara Rao

**Year of Publication:** 1998

**Price:** USD $ 3.47

ఇది కల్పవృక్షం అన్న ఈ విమర్శ గ్రంథం జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందిన తొలి తెలుగు మహాకవి అయిన కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారురచించిన శ్రీమద్రా మాయణ మహాకావ్యాన్ని అన్ని కోణాల నుంచి దర్శింపజేసే ఉత్తమ గ్రంథం. ఆ మహాకావ్యాన్ని పనికట్టుకొని, పఠితలు బెదిరిపోయేట్లుగా, అపప్రథపాలు చేసిన దుర్మతుల ప్రభావాన్ని తొలిగించ గల్గిన సద్గ్రంథం ఇది. సామాన్య పాఠకునికి కావాల్సింది ఏమిటి? ఏమిటంటే -

(1) కావ్యం చదివితే అతనికి అది చాలా భాగం అర్థం కావాలి.

(2)అర్థమవుతూ ఆ కావ్యం ద్వారా కవి ఏ అనుభూతిని పాఠకునకి అందించదలచుకొన్నాడో,దాన్ని అతడు పొంద గల్గాలి.

(3) ఈ అనుభూతి కలుగడానికి కవి నిర్మించిన సోపానాలూ వాటి క్రమమూ ఏదో దాన్ని గ్రహించగల్గాలి.

(4) కావ్యం ద్వారా అనుభూతితో పాటు రచయిత అందించ దలచుకొన్న సందేశాలేవో వాటిని పాఠకుడు గ్రహించగలిగి, అవి అతని ఆలోచనా రీతికి పదును పెట్టాలి.

సగటు పాఠకునికి కావాల్సినవి ఇవి. కాస్త పై స్థాయి పఠిత ఎవరి సాయమూ లేకుండానే వీటినంతా గ్రహించ గలుగుతాడు. మంచి విమర్శకుడు అన్ని స్థాయుల పాఠకుల కోసమూ విమర్శ రాస్తాడు. అన్ని కోణాలనూ ఆవిష్కరిస్తున్న విమర్శకునికి ఇది తప్పనిసరి.

శ్రీ వడలి మందేశ్వరరావు గారు అటు విద్వత్ పాఠకులకూ, ఇటు కేవల సాహిత్యప్రియులైన పాఠకులకూ పనికివచ్చేటట్లుగా 'ఇది కల్పవృక్షం' అన్న ఈ ఉత్తమ విమర్శ గ్రంథాన్ని రచించారు. నాకు తెలిసినంతలో ఒక మహాకావ్యాన్ని (ఆరు కాండల కావ్యం) ఇంత సులభశైలిలో కవి హృదయాన్ని చక్కగా ఆవిష్కరిస్తున్న ఉత్తమ గ్రంథాలలో ఇదే మొదటిది.విశ్వనాథవారి ఈ కల్పవృక్షం మీద ఎందరో విద్వాంసులూ విమర్శకులూ ఎన్నెన్నో రచనలు చేసినప్పటికీ ఇంతగా సామాన్య పాఠకులకు సైతం ఆకట్టుకొనగలిగేటట్లుగా, సులభంగానూ,ఏ క్లిష్టతా లేకుండానూ. సూటిగా ఆవిష్కరించిన ఉత్తమ గ్రంథాలు ఒకటి రెండిటిలో ఇదే మొదటిది. అసలు గ్రంథాలకన్నా కల్పవృక్షం మీద వ్యాసాలూ, వ్యాస సంకలనాలే ఎక్కువగా వచ్చాయి. ఈ విధంగా 'ఇది కల్పవృక్షం' అన్న ఈ గ్రంథం కల్పవృక్షంపై సద్విమర్శలను ఒక ముఖ్యమైన మజిలీకి చేర్చిందని చెప్పాలి.

ఒక రకంగా ఇది ఒక సాహసోపేతమైన రచన అని చెప్పాలి. విశ్వనాథ మన సకలాధ్ర పూర్వ కవుల సంస్కారాన్ని జీర్ణించుకొని రచించిన కవి. ఆయనలో మన సర్వకవుల కావ్య కళామర్మాలు దాగి ఉన్నాయి. పోగా ఆయన ప్రపంచ సాహిత్యాన్నీ అధ్యయనం చేసినవాడు. ఆధునిక ప్రక్రియ అయిన 'నవల' ను నవలా శిల్పాన్ని ఆయన లాగా  అధ్యయనం చేసిన తెలుగు వాళ్ళు చాలా తక్కువగా ఉంటారు. నవలల్లో నవలాకారులు సృజించే పాత్ర చిత్రీకరణం, పాత్ర పోషణం వంటివి, సంఘటనా సృష్టి, ఆద్యంత కథా సంవిధానం వంటివన్నీ కావ్య శిల్పంలోనూ ఉంటాయి.

శ్రీ వడలి మందేశ్వరరావుగారు ఆంగ్ల సాహిత్య కోవిదులు కూడా కావడం చేత విశ్వనాథ వారి రచనా మర్మాలను ఇట్టే  పసి కట్టి 'ఇది కల్పవృక్షం'లో వాటినంతా గొప్పగా ఆవిష్కరించారు.

కల్పవృక్షంలో బాలకాండ తరువాతి కాండలలోని రచనా శిల్పానికి ఆధారం. అరణ్య కాండ కవిత్వంతో వర్ణనలతో  పొంగి పొర్లుతుంటుంది.యుద్ధకాండ ప్రౌఢ శిల్ప భూమి. సుందరకాండలో పాత్రల రూపకల్పన అమోఘం. మొత్తం ఆరు కాండల  కావ్యంలోనూ పాత్రల మనస్తత్వాలను ఆవిష్కరిస్తూ వాటికి  ఒక్కొక్క ప్రత్యేక వ్యక్తిత్వాలను కలిగించడంలో విశ్వనాథ శక్తి నిరుపమానం. వాటినంతా శ్రీ వడలి మందేశ్వరరావు గారీ 346 పుటల గ్రంథంలో గొప్పగా ఆవిష్కరించారు.

రావణాసురునికి ఒక కొడుకు ఉన్నాడు. అతని పేరు అక్షకుమారుడు. ఆంజనేయుడు అశోకవనంలో రాక్షసులను చెల్లాచెదురు చేస్తుంటే ఈ అక్షకుమారుడు ఆయన మీదకు యుద్ధానికి పోతానంటాడు. తండ్రికి (రావణునికి) అక్షకుమారుడంటే ఎంతో ఇష్టం. (అది సహజం కూడానూ!) అతడెంతో అందగాడు. ఐతే అతణ్ని చూడగానే ఆంజనేయునకీ ఎంతో ఇష్టమయింది. అతణ్ని చంపడం ఆంజనేయునికి బొత్తిగా ఇష్టం లేదు.కాని ఆ  కుమారుడేమో ఊరుకోవడం లేదు. తీవ్రంగా యుద్ధం చేస్తున్నాడు. 'బాబూ! నా ముందు వేయి మంది రావణులూ నిలువలేరురా' - అని కూడా అంటాడు ఆంజనేయుడు. అయినా అతడు ఆపలేదు. ఆంజనేయుడు అతని మీద ఒక కొండను విసురుతాడు. అతడు తప్పుకుంటాడు! అతడు బ్రతికి ఉన్నందుకు హనుమంతుడు సంతోషపడ్డాడు. ( ఈ మనశ్చిత్రణ కవి చేయగల్గడం, ఈ విమర్శకుడు దీన్ని చూపడం ఎంతో హృద్యం) అతణ్ని అవమానిస్తే యుద్ధం మానుకొంటాడేమో ననుకొంటాడాయన - కాని వెంటనే "వాడు పసివాడు.అవవమానపరచడం ఎందుకు?" అనీ అనుకుంటాడు! జగదేకవీరుడైన హనుమంతుడు - బ్రహ్మచారి అయిన హనుమంతుడు - యోగీ, మహా భక్తుడు అయిన ఆంజనేయస్వామిలో పితృహృదయాన్ని ఎలా నిక్షేపించారో శ్రీ వడలి మందేశ్వరరావుగారీ విమర్శ గ్రంథంలో అందరికీ అర్థమయ్యే తెలుగులో విశదీకరించారు.

ఇట్లా అనేక ఘట్టాలలో పాత్రలను రచయిత ఎలా సృజించారు? సంఘటనల తీర్పులో పరమార్థం ఏమిటి? వర్ణనల్లో సౌందర్యం ఎలా ఉన్నదీ? మొ॥న అనేక అంశాలను ఈ గ్రంథం విశేషంగా విశదీకరించింది. అరణ్య, కిష్కింధ, సుందరకాండల లోని రామణీయకాలను చూపడంలో శ్రీ వడలి మందేశ్వరరావుగారి భావుకత, ప్రతిభ సహస్రదళ కమలంలా విరిసింది. ఏది రాస్తున్నా, దేన్ని గురించి రాస్తున్నా కథ చెప్పడంలోనూ, కథను ముగించడంలోనూ విశ్వనాథవారు చూపిన 'సొగసు'ను వెలికితీసి చూపడం అన్న దానిపై వడలి వారు ప్రధానంగా దృష్టి నిలిపారు. అందుకే వీరు గొప్ప శిల్ప విమర్శకులుగా పేరుపొందారు. ఒక వృత్తం తర్వాత, ఒక వచనం ఎందుకు రాశాడు కవి? అసలు ఫలాని వృత్తాన్నే,ఎందుకు ఎన్నుకున్నాడు? వెంట వెంట భిన్న వృత్తాలను ఎందుకు రచయిత ప్రయోగించాడు? ఇవన్నీ వడలి వారీ గ్రంథంలో తెలిపారు.

శ్రీ విశ్వనాథవారి 'శ్రీమద్రామాయణ కల్పవృక్షం' అన్న మహా కావ్యంలో వీరు అనుశీలించిన అంశాలు

(1) మఱల నిదేల రామాయణంబన్న

(2) అమరీకైశిక పారిజాతము - బాలకాండ

(3) సాహితీ విమల తీర్థం - అయోధ్య

(4) కథనశిల్పానేక మార్గాభిరామము -అరణ్య

(5) రమ్య భావరస సామగ్రీసమగ్రం - కిష్కింధ

(6) పవిత్రభావ భాసురము -సుందరకాండ

(7) సంశయ నుంచి నిస్సంశయానికి -యుద్ధకాండ

(8) సర్వకవితా సంభారము - కల్పవృక్షము

ఈ ఎనిమిది శీర్షికపై వీరు రచించిన ఇది కల్పవృక్షం అన్నీ ఈ అనుశీలన గ్రంథం కల్పవృక్షం అంటే ఇదే. మరొకటీ మరొకటీ కాదు. భయంలేదు. చదవండి. ఎంతో ఆనందానుభూతిని పొందండి. కవిత్వలాభం సామాన్యలాభం కాదు. అది బ్రహ్మానంద సహోదరం. కవితోపాటు మనకూ అది లభిస్తుంది- అని తన సర్వశక్తులూ ఉపయోగించి మనల్నందర్నీ కల్పవృక్షఫలాలను పొందేటట్లుగా చేస్తున్న మంచిగ్రంథం,ఉత్తమ గ్రంథం, అనశీలన గ్రంథం, ***ఇది కల్పవృక్షం.***

back to book of the week home page

❖ఈ విశేష సమీక్షా వ్యాసం బే ఏరియా తెలుగు అసోసియేషన్ (కాలిఫోర్నియా) వదాన్య సౌజన్యంతో అందించబడింది.